

# పచ్చిపులుసోళ్లే గనక లాకుంటే...

'దస్- హరా. దస్ అంటే పది తలకాయల రావణాసురుడు, హరా అంటే ఓడిపోయి నాడు గనక దస్ హరా అంటే దశకంటుడు ఓడిపోయిన రోజు అదే దసరా'...

హిందీ చెప్పే మా రమణయ్య ఐవోరు చెప్పాల్సిన పాటం చెప్పకుండా దసరా మీద వాయగొడతా ఉంటే మా కుమారస్వామి ఐవోరు ఎప్పటిలాగే మమ్మల్ని సావనూకేదా నికి ఆయన మాడల్‌లో ఒక నోటిసు పంపించినాడు కిలాసులోకి.

'దసరా సెలవలు పలానా తేదీ నుంచి పలానా తేదీ దాకా. అయితే ఈ సెలవలు ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది తరగతులకి మాత్రమే. పదో కిలాసు వాళ్లు ప్రతి రోజూ పొద్దున పదిగెంటల నుంచి మద్యానం పన్నెండు గెంటల దాకా సచ్చినట్టుగా ఇస్కూల్లో జరిగే స్పెషలు కిలాసులకి హాజరు కావలెను. ఈ కిలాసులలో పాత పాటాల రివిజను జరుగును' ఇట్లు కుమారస్వామి కింద సంతకమూ.

అది యిని పిలకాయలందరికీ మండినట్టే నాక్కూడా మండిపోయింది.

'మావా. మా నాయన చెప్పేవాడురా కప్పురాళ్లతిప్పలో ఉండే సెటిల్మెంటోళ్లు ప్రతి రోజూ బిట్రగుంట స్టేషనుకి పొయ్యి సంతకం పెట్టి వస్తా ఉండాలంట పనున్నా లాకపో యినా. అట్టుందిరా మన పని. దసరా సెలవలకి కూడా ఏందిరా మరీ అన్యాలంగా' అన్నాను సాయంత్రం ఇస్కూలు నుంచి అందరం కలిసి ఇళ్లకి పోతా ఉంటే కచ్చగా.

దానికి మురళీగాడు అందుకొని- 'ఛ. సెలవలు వస్తా ఉన్నాయని ఇప్పటికే గుడ్డలు ఉతికించుకొని సాకలి ఎంకయ్యకాడ ఇస్త్రీ కూడా చేయించుకొని రెడీ అయిపోయున్నానురా గుంటూరికి పోదామని చెప్పి. మొన్నే మా అమ్మ జాబు కూడా రాసింది- వాణ్ణి ఎట్ట యినా గుంటూరుకి పంపండి మంచి నెయ్యి వొచ్చుంది నాలుగు రోజులుండి ముద్ద పప్పులో తినేసిపోతాడు అని. ఈ దెబ్బతో పప్పూ పాయే నెయ్యీ పాయే గదరా' అన్నాడు రోడ్డు మీది కంకర రాయిని కాలితో తంతా.

దానికి మాలకొండరావు అందుకొని 'నెయ్యి గియ్యిది ఏముందిరా. కావాలంటే మా యింటికి రా. మా అమ్మని అడిగి గిద్దెడు పోయిస్తా. అది కాదురా నా బాద. మాకు మాల కొండ మొక్కు ఉంది. ఈ సెలవల్లో పోదామని చెప్పినాడు మా నాయన. ఇంక కేన్సిలే గదరా' అన్నాడు బాదపడిపోతా.

'మాలకొండ మొక్కు ఏందిరా?' అన్నాను నేను.

'నా పేరు అదే గదరా. మాలకొండ స్వామిది. కందుకూరు దాటిన చాలా దూరానికి వొస్తుందిరా మాలకొండ. నువ్వు బక్త ప్రహ్లాద సినిమా చూశావంటే అవుపిస్తాడు చూడూ నరసింహస్వామి... ఆ స్వామి ఉంటాడురా ఆ కొండ మీద. అది మాలకొండగాబట్టి ఆ స్వామిని మాలకొండస్వామిని చేసి ఆయన పేరుగా మాలకొండరావు, మాల్యాద్రి, మాళీ అని పెడతా ఉంటార్రా మన పక్క. అట్ట పెట్టిందేరా నా పేరు' అన్నాడు వాడు.

'ఇప్పుడు ఎట్టరా. కిలాసులకి రాకపోతే ఐవోరికి కోపం. మొక్కుకు రాకపోతే స్వామికి కోపం. నడిమద్యన నలిగినాను గదరా' అన్నాడు మళ్లీ.

'మీ సంగతి అటుంచండిరా. వొద్దు మొర్రో అంటా ఉన్నా మా నాయన నా మాట యినకుండా 'రాష్ట్ర' కట్టించినాడు ఈసారి. సెలవలు వస్తా ఉన్నాయి గదా టైము దొరకద్ది ఆ పాటాలు చదువుకుందాము అనుకున్నానురా. అసలకి నాకు బుద్దిలేదురా. ప్రాదమికా, మద్యమికా ప్యాసయ్యి దూరదర్శనులో వచ్చే హిందీ వార్తలని మా నాయనకు అర్దమ య్యేలా చెప్పడమేరా నేను చేసిన ఫాల్టు' అన్నాడు కేతిరెడ్డి శ్రీదరురెడ్డిగాడు.

అప్పుడు అందరూ నా పక్కకి చూసి 'నీ కేమిరా. ఒక దిగులా. ఒక చింతా. హాయిగదరా నీ పని' అన్నారు నాతో.

'మీరు బలేవాళ్లురా. నా బాద ఎవురితో చెప్పుకోనురా. అందరికంటే పెద్ద దెబ్బ నాకే గదరా' అన్నాను నేను.

'అదేందిరా?' అన్నారు వాళ్లు.

'ఈ సెలవల్లో హాయిగా మా ఎనకపక్క దాసాని చెట్టు కింద మంచం ఏసుకొని పొణు కుని మంచి మంచి కతల పుస్తకాలన్నీ ఊదిపారేద్దామని అనుకుంటా ఉంటే నా ప్లానంతా కుడితిలోకి పాయెను గదరా. ఇప్పుడు చూడు. స్పెషలు కిలాసులు అనంటే ఊరికే వొదులు తారా? హోంవర్కులంటారు, ఒప్పచెప్పడాలంటారు. సాయంత్రం ఎట్టా ఎం.ఆర్ ఐవోరు

కాసుకుని ఉంటాడు మన ప్రాణానికి. తూ. బతుకంతా ఇట్టే పాయె గదరా' అన్నాను ఎంతో కచ్చగా.

'అవునురా. పాపం వాడికి కతలంటే బలే ఇంట్రెస్టురా. పేడలో పడున్న కాగితాన్ని కూడా తీసుకొని చదివేస్తా ఉంటాడురా' అన్నాడు శ్రీదరుగాడు.

'అంత ఇంట్రెస్టు ఏందిరా? మరీ యిచిత్రం గాకపోతే. నాకు తేగల్లో చందమామలు తినడం అంటే ఇంట్రెస్టు. ఆ ఇంట్రెస్టులో ఒక అర్దం ఉంది, తిని కడుపు నింపుకోవడంలో ఒక పరమార్దం ఉంది. కతల మీద ఇంట్రెస్టు పెట్టుకుంటే ఏమి వస్తుందిరా. టైము వేస్టు తప్పు' అన్నాడు మాలకొండరావుగాడు.

నాకు చుర్రుమంది ఆ మాటలకి.

'ఒరే...నీలాగ తేగల్లో చందమామలు తినేవోడికి నేను చదివే చందమామల ఇంట్రెస్టు అర్దం కాదులేరా. నీకు తెలుసునా అయి దొరకడానికి ఎన్ని అవస్తలు పడాల్నో. బియ్యానికి పాతశెట్టి కాడికిపోయినప్పుడల్లా ఆడ తూకానికి వొచ్చుండే పాత పుస్తకాల నుంచి అడుక్కొచ్చు కొని మరీ ఒక్కో చందమామని పదహారుసార్లు చదువుకుంటానురా నేను. నా బోటోళ్లకి బయట కొత్తయ్యి కొనుక్కోవడం అయ్యేపని కాదు గనక ఈ సెలవల్లో చిల్లర అంగళ్లన్నీ తిరిగి మంచి మంచియ్యి ఏరుకొచ్చుకుందామనుకుంటే'... మాటలు రాక నాకు కళ్లమ్మట నీళ్లొచ్చినంత పనయ్యింది.

అది చూసి కేతిరెడ్డి శ్రీదరుగాడు చాలా యిదయిపోయినాడు.

వాడిది జాలి గుండె గనక– 'ఒరే ఒక పని చెయ్యరా. ఇంక మీదట ఒకరు రాసిన కతల మీద పడి బతకకుండా నువ్వే కతలు రాయడం మొదలుబెట్టరా. ఎగ్జాంపులుకి మన నలుగురు ఫ్రెండ్సు మీద రాయరా. ముగ్గురు డల్లుగా ఉంటారు. ఒకడు క్లవరుగా ఉంటాడు. క్లవరు పెరిగి పెద్దవాడయ్యి డల్లుగా ఉన్న ముగ్గురకీ మేలు చేస్తాడు... ఈ వాటంలో రాయరా. క్లవరుకి కావాలంటే నా పేరు వాడుకోరా' అన్నాడు.

'నువ్వు అంత మాట అన్నావు నాకు అంతే చాలురా. క్లవరుకి నీ పేరు పెట్టినా నా పేరు పెట్టినా నువ్వు కాదనవని నాకు తెలుసురా. ముందర ఈ సెలవల్లో మాత్రం నేను కతలు చదవాల్సిందేరా' అన్నాను నేను.

మురళీగాడు నన్ను ఆపి 'నువ్వంతగా చెప్తా ఉంటే నాకొకటి గుర్తుకు వస్తా ఉందిరా. మా ఇంటి కాడ పచ్చిపులుసోళ్లు ఉన్నారు. వాళ్లు పుస్తకాలు బాడిక్కి ఇస్తా ఉంటారు. మా అమ్మ యీడకి వొచ్చినప్పుడల్లా పొయ్యి తెచ్చుకుంటా ఉంటుంది. నువ్వు కూడా పొయ్యి తెచ్చుకోరా. తెచ్చుకొని చదువుకోరా' అన్నాడు.

'అవునా. అయితే రేపే నాకు వాళ్ల యిల్లు చూపీరా. పొయ్యి కలుస్తానురా' అన్నాను నేను హుషారుగా.

మరుసటి రోజు మురళీగాడు నన్ను పచ్చిపులుసోళ్ల ఇంటికి తీసుకెళ్లాడు. వాళ్లు చాలా పెద్ద శెట్టిగార్లు. ఒకప్పుడు ట్రంకురోడ్డులో పేద్ద పుస్తకాల బాడిగ షాపు నడిపేవాళ్లంట. ఇప్పుడు దాన్ని చిల్లరకొట్టుగా మార్చి, అప్పటి పుస్తకాలన్నీ ఇంట్లో మిద్ది మీద పడేసి, వృదాగా ఎందుకు ఉంచడం అని, చుట్టుపక్కలవాళ్లకి అద్దెకి ఇస్తా ఉన్నారు.

ఈ పుస్తకాల మీద వొచ్చే చిల్లర వాళ్లకి ఏ మాత్రం లెక్కలోనిది కాదు గనక వాటి కోసం వచ్చే మనుషులని కూడా లెక్కలో లేనట్టుగా చూడటం అలవాటయినట్టుంది మమ్మల్ని చూట్టం తోటే 'ఎవురా?' అంది శెట్టెమ్మ పెద్దంగా.

ఆ అరుపుకి నేనూ మురళీగాడూ జడుసుకొని గడపకి ఒక కాలు లోపల, ఒక కాలు బయట పెట్టి నిలబడి పోయినాం.

'ఈ అబ్బాయికి.. అద్దెకి.. పుస్తకాలకి'... అన్నాడు మురళీగాడు తత్తర పడతా.

శెట్టెమ్మ మమ్మల్ని దగ్గర దాకా వచ్చి చూసి 'పుస్తకాలకా. రండి రండి' అని మిద్దె మీదకి తీసకెళ్లింది.

లోపల కట్టలు కట్టలుగా గుట్టలు గుట్టలుగా అట్టలు ఉండి, అట్టలు ఊడిపోయి, కుదురుగ్గా ఉండి, కుదురుగ్గా ఉండకా లెక్కలేనన్ని పుస్తకాలు... అలవిగానన్ని పుస్తకాలు... రా నాయన రా.. వచ్చి మమ్మల్ని తినిపో అన్నట్టుగా పిలస్తా ఉన్నాయి.

నేను కళ్లన్నీ వాటి మీదనే పెట్టి చూస్తా ఉంటే 'అబయా. ముందరే తెలుసుకోవడం మంచిదని చెప్తా ఉన్నా. ఒక్కో పుస్తకానికి అద్దె ఒక్కో రోజుకి పావల. రోజు దాటి ఇస్తే దాటిన ఒక్కో రోజుకీ ఎగస్ట్రాగా పది పైసలు కట్టాల. పుస్తకం యింటికి కావాలంటే ఇస్తాము గానీ మొదలు రెండు రూపాయలు అడ్మాన్సుగా మా దగ్గర పెట్టి పెట్టాల. పుస్తకాలు తీసు కొని మీరు ఉడాయిస్తే మేము మిమ్మల్ని ఎతుక్కుంటా తిరగలేము గాబట్టి ఈ అడ్మాన్సు. కుదరదూ అడ్మాన్సు కట్టలేము అని అంటారా... దానిక్కూడా మార్గం ఉంది. మీరు ఈడికే వొచ్చి చదువుకోండి. మీరూ మాకాణ్ణే ఉంటారు పుస్తకమూ మాకాణ్ణే ఉంటుంది గాబట్టి బయం లేదు. గెంటకు పదిహేను పైసల లెక్కన ఎన్ని గెంటలైనా ఉండి ఎన్ని పుస్తకా లన్నా చదువుకొని పోండి' అంది శెట్టెమ్మ డిటైలుగా.

అంతా ఇన్నాక మాకు కళ్లు తిరిగిపోయినాయి.

'ఏం చేస్తావురా?' అన్నాడు మురళీగాడు.

'ఈడ కూచుని చదువుకోవడం అసయంగా ఉంటుందిరా. ఇంటికి తీసకెళ్లి మనకు ఎప్పుడు కావాలంటే అప్పుడు చదువుకోవడమే బాగుంటుంది' అన్నాను.

'మరి అడ్మాన్సుగా రెండు రూపాయలు యాణ్ణుంచి తెస్తావురా?' అన్నాడు.

'చూద్దాంమురా' అని వచ్చేశాము మేము.

ఇప్పుడు నాకు అడ్మాన్సుకు కావలసిన రెండు రూపాయలు ఎట్టా అనేది పెద్ద కొసెను అయిపోయింది. మా అమ్మని అడిగితే చెప్పు తీసుకొని కొడుతుంది. మా నాయనను అడి గితే చూద్దాం చూద్దాం చేద్దాం చేద్దాం అనే మనిషి. మరి ఎట్టా? ఏద్దైనా అమ్మితే? ఇంట్లో ఉన్న పాత రేకులు, పాత పుస్తకాలు తూకానికి ఏస్తే డబ్బులు వస్తాయి గదా అని ఇల్లాంతా కలిబెట్టి వదిలినాను. ఒక్కటి కూడా దొరకలా. కానీ నా టైము బాగుండి రెండు ఖాళీ సోడా సీసాలు కనిపించినాయి. పెండెం వాళ్ల అంగడి నుంచి మా నాయన ఐసు సోడాలు తెచ్చి, తిరిగి యియ్యడానికి పాలు మారి అట్నే పెట్టేసుంటాడు గదా, ఆ సోడా సీసాలే అయి.

ఆ సోడా సీసాలని అమ్మి పార్నుకితే?

మా అన్నని ఐడియా అడిగినాను.

'కోర్టు ఎదురుంగా ఖాదరుబాషా అని ఒకడుంటాడు. వాడు కొంటాడు సోడా సీసాలు. మూడొచ్చి రెండు రూపాయలు. పో తెచ్చుకోపో' అన్నాడు వాడు.

'రెండే ఉన్నాయి' అన్నాను నేను.

'రూపాయి పావలా యిస్తాడు. అదే మూడుంటే రెండు రూపాయలు యిస్తాడు' అన్నాడు మా అన్న.

మూడో సోడా సీసా యాణ్ణుంచి తెచ్చేది?

శ్రీదరు వాళ్లింటికి పొయ్యి 'శ్రీదరా, నువ్వేరా దిక్కు' అన్నాడు వాడితో.

వాడు పొడుగ్గా ఆలోచించి 'మా ఇంట్లో సోడా సీసా ఒకటి ఉంది గానీ దాన్ని అడిగితే మా నానమ్మ యియ్యదురా. దొంగతనంగా తేవాలంటే... మరీ హీనంగా సోడా సీసా ఏందిరా?' అన్నాడు వాడు.

'మరి నువ్వే గదరా నన్ను కతల్లో ఎంకరేజీ చేసేది. మరి నేను రేపు కతలు రాస్తే నీకే గదరా పేరు' అన్నాను నేను.

ఆ మాటకు వాడు కరిగిపోయి, సస్తా బతకతా, పుస్తకాల సంచిలో సోడాబాటిలు దాచిపెట్టి తెచ్చిచ్చినాడు సీక్రెటుగా. వెంటనే నేను ఆ మూడు సీసాలు అమ్మి రెండు రూపాయలు చేతుల్లో ఏసుకున్నాను.

అట్టా వచ్చిన రెండు రూపాయలతో పచ్చిపులుసోళ్ల కాడ దసరా సెలవులప్పుడు ఏం ఖర్మా ఆ తర్వాత ఎప్పుడు సందు దొరికితే అప్పుడు లెక్కలేనన్ని చందమామలు, బాలమిత్రలు, షాడోలు, బుల్లెట్‌లు, యుగంధర్‌లు, పిలకాయల రాజుల నవలలు వరసపెట్టి చదివినాను.

పచ్చిపులుసోళ్లు నా పిచ్చి చూసి చివర చివరలో రెండు మూడు కట్టలు పక్కన పెట్టి 'నాయనా. ఇయి నువ్వే ఉంచుకో పో' అని ఇచ్చేసినారు.

ఇప్పటికీ మా ఊరి శెట్టిగార్లలో బైసాని వాళ్లు అని, టంగుటూరి వాళ్లు అని, గాదంశెట్టి వాళ్లు అని, కందుకూరి వాళ్లు అని చాలా మంది పెద్ద పెద్ద శెట్టిగార్లు ఉన్నారు. కానీ వాళ్లందరిలోకెల్లా పచ్చిపులుసోళ్లే గ్రేటు.

ఎందుకంటే వాళ్లు నాకు పుస్తకాలు యిచ్చి నాకూ మా కావలికీ 'సాహిత్య సేవ' చేసినారు. వాళ్లే గనక లాకుండా ఉంటే, వాళ్ల పుస్తకాలే గనక నేను చదివకుండా ఉండి ఉంటే ఇయ్యాల ఈ మాత్రం కతలు రాసుండేవాణ్ణా? రాసి మా కావలి పేరూ, సోడా సీసా యిచ్చినందుకు మా శ్రీదరుగాడి పేరూ నిలబెట్టి ఉండేవాణ్ణా?

అంతా పచ్చిపులుసోళ్ల దయ.

■